

సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా


ఆదివారం ׀ 5 ׀ జనవరి ׀ 2025






నేవీ షో.. అదిరింది


ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్ఞాపిక బహూకరిస్తున్న మెరైన్ కమాండో, చిత్రంలో ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్












బందీలను విడిపించేందుకు తీరానికి చేరుకున్న మార్కోస్


విన్యాసాలు తిలకిస్తున్న నేవీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో భారత నావికాదళం సమర శంఖం పూరించింది. దేశ రక్షణలో నావికాదళం చేస్తున్న కృషిని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించింది. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం సాయంత్రం నిర్వహించిన ఆపరేషనల్ డెమో ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. సాయంత్రం 4.40 గంటలకు ప్రారంభమైన విన్యాసాలు సుమారు గంటన్నర పాటు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, తూర్పు నావికాదళ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మంత్రులు వంగలపూడి **అనిత, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీలు గొల్ల బాబూరావు, సీఎం రమేష్, మేయర్ హరివెంకటకుమారి,** ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నేవీ సిబ్బంది విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మారిటైం గేట్ వేగా ఏపీ అభివృద్ధి చెందుతోందన్నారు.


బాణసంచా వెలుగులు

విన్యాసాలు సాగాయిలా..

- భారత నావికాదళం అద్భుతమైన విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ముందుగా జాతీయ, నావికాదళ పతాకాలను ఎగురవేశారు. నావికాదళ వాద్య బృందం శ్రావ్యమైన జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ఆరంభమైంది. అనంతరం చేతక్ హెలికాప్టర్లు త్రివర్ణ పతాకం, నావికాదళ పతాకాన్ని రెపరెపలాడిస్తూ ఆకాశంలో విహరించాయి.
- విపత్కర పరిస్థితుల్లో బందీలను విడిపించడానికి మెరుపుదాడి చేసే మెరైన్ కమాండోల(మార్కోస్) విన్యాసాలు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో సముద్రంలోకి దిగిన కమాండోలు, వెంటనే బోటులో తీరానికి చేరుకుని బందీలను విడిపించిన తీరు ఉత్కంఠభరితంగా సాగింది. వారి ధైర్యసాహసాలకు ప్రజలు సెల్యూట్ చేశారు. ఆయిల్ రిగ్ పేల్చివేత విన్యాసం ప్రేక్షకులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.
- ఆకాశం నుంచి నాలుగు పారాచూట్ల సాయంతో దిగిన మార్కోస్ బృందం ప్రత్యేక జ్ఞాపికను సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేసింది.
- ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ యుద్ధ నౌకలపై హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ల్యాండింగ్ అయిన విధానం విశేషంగా ఆకట్టుకుంది.
- తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ, శత్రువుల రాడార్లకు చిక్కకుండా సంచరించే హాక్ యుద్ధ విమానాల వ్యూహాత్మక విన్యాసాలు, నాలుగు చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు కనులపండువగా సాగాయి. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల అన్వేషణ, రక్షించే విధానాల ప్రదర్శన ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.
- నావికాదళ సిబ్బంది విధులు, వారి జీవనశైలిని వివరిస్తూ సీ క్యాడెట్ కార్ప్స్ విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన లయబద్ధంగా సాగింది. యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ ఫైరింగ్, యుద్ధ నౌకల నుంచి చేసిన నమూనా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. చేతక్, సీ కింగ్ హెలికాప్టర్లు, డార్నియర్ హెలికాప్టర్, హాక్ జెట్ ఫైటర్ల విన్యాసాలు ఉత్సాహాన్ని నింపాయి.
- చివరగా నావికాదళ వాద్య బృందం ప్రత్యేకంగా అందించిన బీటింగ్ రిట్రీట్, తుపాకులతో అగ్నిని రగిలించే కంటిన్యుటీ డ్రిల్ కవాతు, నౌకలపై మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఐఎన్ఎస్ సావిత్రి నుంచి నిర్వహించిన లేజర్ షో.. దేశభక్తి గీతాలకు అనుగుణంగా సాగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం అదరహో అనిపించింది. ప్రాచీన యుద్ధ కాలం నుంచి నేటి వరకు భారత రక్షణ వ్యవస్థ ప్రతిష్టను డ్రోన్ షో కళ్లకు కట్టినట్టు చూపించింది.
- నేవీ విన్యాసాల్లో ఎటువంటి అపశృతులు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు.


విన్యాసాలను తిలకిస్తున్న నగర ప్రజలు

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ దినేష్‌కుమార్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొత్తగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు వడ్డించిన ఆయన వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకం అమలు జరుగుతోందన్నారు. దీనివల్ల 2900మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రెస్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఎంపీపీ రత్నకుమారి వైస్ ఎంపీపీ జి. శివకుమార్, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరకులో @ 4.1 డిగ్రీలు

- కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు

చింతపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. శనివారం అరకులోయలో అత్యల్పంగా 4.1, జి.మాడుగులలో 4.5, అనంతగిరిలో 7.9, చింతపల్లిలో 8.0, డుంబ్రిగుడలో 5.7, గూడెంకొత్తవీధిలో 5.8, హుకుంపేటలో 6.4, కొయ్యూరులో 12.3, ముంచంగిపుట్టులో 9.0, పాడేరులో 5.9, పెదబయలులో 7.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ విషయాన్ని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

దుశ్చర్తి పోలీసుస్టేషన్ తనిఖీ

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తి పోలీసుస్టేషన్‌ను రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. గంజాయి, సారా తయారీ, రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. వీటి జోలికి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రేపటి నుంచి పింఛనుదారుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా హెల్త్, డిజెబుల్డ్ పింఛనుదారుల ధ్రువీకరణ పత్రాలను ఈనెల 6 నుంచి పునఃపరిశీలించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పునఃపరిశీలనకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేజీహెచ్‌కు చెందిన ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక మెడికల్ అధికారి, ఒక డిజిటల్ సహాయకులతో కూడిన బృందం నోటీసులు అందుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారని చెప్పారు. నోటీసులు అందుకున్న లబ్ధి దారులు ఆ సమయానికి ఇంట్లో అందుబాటులో ఉండి వైద్య బృందానికి సహకరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 76 మంది మాత్రమే హెల్త్, డిజెబుల్డ్ పింఛన్‌దారులు ఉన్నందున్న నాలుగు రోజుల వ్యవధిలోనే పునఃపరిశీలన పూర్తి చేయాలని తనిఖీ బృందాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ మురళి, డీపీవో లవరాజు, డీఎల్పీవో కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పాడేరు సీఐ దీనబంధు పాల్గొన్నారు.

డొంకరాయిలో లక్ష్యానికి మించి విద్యుత్ ఉత్పత్తి


డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో కేక్ కట్‌చేస్తున్న సీఈ వాసుదేవరావు, జెన్‌కో అధికారులు

మోతుగూడెం: సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం లక్ష్యానికి మించి ఉత్పత్తి సాధించిందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. 2024–2025 సంవత్సరంలో ఈ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 95.14 మిలియన్ యూనిట్లు లక్ష్యం నిర్ణయించగా, డిసెంబర్ నెలకు 95.14 ఉత్పత్తి సాధించి రికార్డు సృష్టించిందని తెలిపారు. మరో మూడు నెలలు ఉండగానే లక్ష్యానికి మించి సాధించడంతో స్థానిక చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ప్రాజెక్ట్ అధికారులు, కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా సీఈ వాసుదేవరావు జలవిద్యుత్ కేంద్రంలో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈవో ఎం చిన కామేశ్వరరావు, డీఈ భాస్కరరావు, ఏడీఈ చంద్రమోహన్, జెన్‌కో అధికారులు కార్మికులు పాల్గొన్నారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ధరలు ఇలా..

ప్రకటించిన గిరిజన సహకార సంస్థ

పాడేరు : రాష్ట్రంలోని వివిధ ఐటీడీఏల పరిధిలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు 2024–25 సంవత్సరానికి జీసీసీ కొనుగోలు ధరలను ప్రకటించింది. వీటిపై గిరిజనులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆ సంస్థ ఎండీ సిబ్బందికి సూచించారు. కొనుగోలు ధరలు వివరాలు ఇలా ఉన్నాయి. కిలో కరక్కాయలు రూ.20, ముసిడి గింజలు రూ.100, తానిక్కాయలు రూ.18, నల్ల జీడిపిక్కలు రూ.22, చింతపండు (పిక్కతో) రూ.34. పిక్క తీసిన చింతపండు రూ.67, కాగు పప్పు రూ.25, విప్ప బద్దలు రూ.32, కుంకుండుకాయలు రూ.35, సీకకాయ రూ.40, అడవితేనె రూ.250, పెట్టె తేనె రూ.150, తేనె మైనం రూ.160, పిక్క, ఉట్టి తీసిన చింతపండు రూ.90, ఇండుగ పిక్కలు రూ.50, నరమామిడి చెక్క రూ.18, కొండచీపుర్లు గ్రేడ్ 1,2,3 రూ.45, రూ.40, రూ.35, ఎండు ఉసరి రూ.90 చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపింది. చింతపండు పిక్కలు రూ.10, మారేడు గడ్డలు రూ.300, విప్ప పువ్వు రూ.17, కొండ తామర జిగురు గ్రేడ్–1 రూ.200, గ్రేడ్–2 రూ.150, గ్రేడ్–3 రూ.120, గుగ్గిలం గ్రేడ్–1 రూ.110, గ్రేడ్–2 రూ.70, తిప్పతీగ రూ.11, రాళ్ల చెక్క రూ.10, పాలగుండ వేరు(యూరో రూట్) రూ.270, పసుపు రూ.70, బొబ్బర్లు రూ.50, రాజ్‌మా చిక్కుళ్లు (రెడ్) రూ.80, రాగులు రూ.30, ఎండు మిరపకాయలు కిలో రూ.145 చొప్పున కొనుగోలు ధర నిర్ణయించినట్టు పేర్కొంది.



వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత

8లో

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి

క్లుప్తంగా

ప్రణాళికపరమైన చర్యలతో వ్యాధుల కట్టడి

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


గూడెంకొత్తవీధి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

గూడెంకొత్తవీధి: ప్రణాళికపరమైన చర్యలతో వ్యాధులను కట్టడి చేయవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా సూచించారు. శనివారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సర్వేల్లో క్యాన్సర్, బీపీ, మధు మేహం రోగులకు సత్వర వైద్యం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణులను ప్రసవానికి పదిరోజులు ముందుగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు, గర్భిణుల వసతిగృహాలకు తరలించాలన్నారు. ఇలా చేయడం వల్ల మన్యంలో చాలా వరకూ డోలీమోతలు, మాతా శిశు మరణాలు నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్‌కుమార్, అచ్యుత్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు తోంకోట అమ్మవారి జాతర

హుకుంపేట: తోంకోట అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభం కానుంది. అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దులో ఉన్న తోంకోట అమ్మవారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు.

ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు : వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు సీసీ కిరణ్ పేరిట ఉద్యోగాలు ఇస్తామని దళారులు ఎవరైనా చెబితే అటువంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. వారి వివరాలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇటీవల కాలంలో కొంతమంది దళారులు తమ పేర్లను ఉపయోగించి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగాల కోసం, డ్యూటీ సర్వీస్ సర్టిఫికెట్ల కోసం ఎవరైనా మధ్యవర్తిత్వం చేస్తే నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. ఈ విషయంలో నిరుద్యోగులు, ప్రజలు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత


విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి తదితరులు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- పాడేరులో జిల్లాస్థాయి ప్రదర్శన ప్రారంభం
- అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి: అరకు ఎంపీ తనూజరాణి

పాడేరు : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మతకను, ప్రతిభను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనుజారాణితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. దివంగత డాక్టర్ అబ్దుల్ కలాం, సర్ సీవీ రామన్, సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. వాటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రతి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ప్రదర్శన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో చదివిన అంశాలను చక్కగా ప్రదర్శించారన్నారు. అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనుజారాణి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు మళ్లించేందుకు తరచుగా వైద్య వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులంతా అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తానని చెప్పారు. అనంతరం గత నెల 30న విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో జరిగిన పలు క్రీడాంశాల్లో గెలుపొందిన గిరిజన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీ రావు, హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు

సంస్కరణలతోనే విద్యారంగం అభివృద్ధి


చింతపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అభిషేక్ గౌడ

- జేసీ అభిషేక్ గౌడ

చింతపల్లి: సంస్కరణలతోనే విద్యారంగం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జేసీ అభిషేక్‌గౌడ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం ప్రభుత్వం చేపట్టిన డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. వారితో కలసి భోజనాలు చేశారు. విద్యార్థి దశనుంచి లక్ష్యంతో చదవాలని సూచించారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు వల్ల ఆదా అవుతున్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజుబాలయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ దురియా పుష్పలత, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.


హుకుంపేటలో సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

చదువుపై దృష్టి సారించాలి

హుకుంపేట: చదువుపై దృష్టి సారించి ఉన్నతస్థాయికి ఎదగాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,వైస్‌ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ సాంబశివ రావు, వైస్ సర్పంచ్ గోవింద్ పాల్గొన్నారు.


రంపచోడవరంల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ఏజెన్సీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పీవో , సబ్ కలెక్టర్ కల్పశ్రీలు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో ఎం.రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, హెచ్‌ఎం పద్మావతి, విద్యా కమిటీ చైర్మన్ సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

జి.మాడుగుల: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గిరిజన ఉప ప్రణాళిక నిధుల సహకారంతో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన రైతులకు కోళ్ల గూళ్లను అనకాపల్లి జిల్లా, రాంబిల్లి, హరిపురం బీసీటీ కేవీకే భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కోళ్ల పరిశోధన సంచాలనాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి.ఎల్. ఎన్.రాజు తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కోళ్ల పరిశోధన సంచాలయం(ఐసీఏఆర్‌డీపీఆర్) రాజేంద్ర నగర్, హైదరాబాద్ ఆర్థిక సాయంతో సరియా గ్రామంలో శనివారం పద్మాపురం, తోకచిలక, బూసుపల్లి, కాయబండ, గొప్పలపాలెం, కృష్ణాపురం తదితర 15గ్రామాల్లో 100మంది గిరిజన రైతులకు కోళ్ల గూళ్లను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. జెనెటిక్స్ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వనరాజ, గ్రామ ప్రియా రకాల కోళ్లు ఐసీఏఆర్‌డీపీఆర్‌లోనే అభివృద్ధి చేసినట్టు ఆయన వివరించారు. కోళ్ల పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కోళ్ల దాణా తయారీని వివరించారు. బీసీటీ కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాజ్ఞి కోళ్లకు వచ్చే రోగులు, నివారణపై అవగాహన కల్పించారు. బీసీటీకే సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ డాక్టర్ శైలజ మాట్లాడుతూ కెవీకే అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీటీ కెవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఐసీఏఆర్ డీపీఆర్ శాస్త్రవేత్తలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌సీ సిబ్బంది, వార్డు నంబర్ నూకరాజు, గిరిజన రైతులు పాల్గొన్నారు.


సరియాలో గిరిజన రైతులకు కోళ్లగూళ్లను పంపిణీ చేస్తున్న పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజు

'పంచాయతీ టూ పార్లమెంట్'కు గిరిజన ప్రజాప్రతినిధులు

- ఢిల్లీ బయలుదేరిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

అరకులోయ టౌన్: ఢిల్లీలో ఈనెల 5,6 తేదీల్లో జరగనున్న పంచాయతీ టూ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు అరకులోయ జెడ్పీటీసీ శెట్టి రోషిణి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి ఏడుగురు మహిళా ప్రజా ప్రతినిధులు వెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి తనతో పాటు ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి పల్లి సుభద్ర, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి, పాడేరు, హుకుంపేట, మట్టం సర్పంచ్‌లు ఉషారాణి, వెంకటపూర్ణిమ, శాంతకుమారి, ముంచంగిపుట్టు ఎంపీటీసీ సుబ్బలక్ష్మి వెళ్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.


ఢిల్లీ బయలుదేరిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తా

- సీలేరు ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి హామీ


మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఉద్యోగులతో సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఈ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి

ముంచంగిపుట్టు: మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఈ(సివిల్) చంద్రశేఖర్‌రెడ్డి ఉద్యోగులు, సిబ్బందికి హామీ ఇచ్చారు. ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు.విద్యుత్ ఉత్పత్తిపై ఆరా తీశారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహంలో ప్రాజెక్టు కార్మిక నాయకులు, ఐకాస నాయకులతో సమావేశం అయ్యారు. వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రాజెక్టులో ఏటా తాగునీటి కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నా నేటికి బురదనీరే గతి అవుతోందని ఉద్యోగులు వివరించారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు పరిసర మార్గాలు అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ లేనందున వర్షం పడితే రోడ్లుపై బురద, చెత్త ఉండిపోతుందని వారు పేర్కొన్నారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులు అధ్వాన రహదారుల వల్ల అవస్థలు పడుతున్నారని వారు వివరించారు. వించ్ హౌస్, విద్యుత్ కేంద్రం, ప్రాజెక్టు ఆస్పత్రి రహదారులు వర్షకాలంలో చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. నిధులు కేటాయిస్తున్నా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని కార్మిక సంఘ నాయకులు, ఐకాస నాయకులు వాపోయారు. దీనిపై స్పందించిన ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ టెండర్ల సమయంలో టెండర్ పొందిన వ్యక్తి వద్ద ముందుగా 10శాతం ఈఎండీ తీసుకున్న తరువాతే పనులు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆధికారులకు సూచించారు. అనంతరం ప్రాజెక్టు కాలనీలను ఎస్‌ఈ పరిశీలించారు. నెలకొన్న సమస్యలను గుర్తించారు. మూడు నెలల వ్యవధిలో సమస్యలు పరిష్కరిస్తామని చీఫ్ ఇంజినీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ బి.గోవిందరాజులు, ఏడీఈ సివిల్ టి.వెంకటమధు, ఉద్యోగ ఐకాస నాయకులు ఈశ్వరావు, వీరస్వామి, మోహన్ లాల్, జోగి కూర్మారావు, రబీరావు, సూర్యప్రకాష్, మాధవరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

అరకు ఉత్సవాలతో ఒరిగేదేమీ లేదు

పాడేరు రూరల్: అరకు ఉత్సవాలతో గిరిజనులకు ఒరిగేదేమీ లేదని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉన్న అనేక ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా అరకు ఉత్సవాల పేరుతో లక్షల రూపాయలు వెచ్చించి ఉత్సవాలు నిర్వహించడం అవసరమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో ఆశ్రమ పాఠశాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ,గ్రామల్లో తాగునీరు, రహదారి సౌకార్యం లేక డోలిమోతలతోనే ఆదివాసీ ప్రజలు గడుపుతున్నారన్నారు. ఇటువంటి అనేక రకాల ఇబ్బందులతో గిరిజనులు అల్లాడుతుంటే అరకులో ఉత్సవాలు నిర్వహించి పండుగా చేసుకోవడం సిగ్గుగా లేదా అన్నారు. ఉత్సవాలకు కేటాయించాల్సిన నిధులు గిరిజనుల అవసరాలకు కేటాయించడంలో ఎందుకు విఫలమైనట్టు ప్రశ్నించారు. నేటికి టూరిజం నుంచి వచ్చే నిధులను పంచాయతీ అభివృద్ధికి ఎందుకు వెచ్చించడం లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో జీవో నంబర్ -3 లేక నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పాడేరు,చింతపల్లి, అరకులోయ, ప్రాతాల్లో పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి టూరిజం నుండి కోట్ల రూపాయలు నిధులు వస్తున్నా గిరిజన ప్రాంతాలు అభివృధికి ఎందుకు నిధులు కేటయించడం లేదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలని డిమాండ్ చేశారు, నాయకులు లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

విద్యార్థులకు క్రీడా పోటీలు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అరకు బ్లాక్ లెవెల్ పోటీలు నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి జి. మహేశ్వరరావు పర్యవేక్షణలో వాలీబాల్, కబడ్డీ, లాంగ్ జంప్, ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. పీడీ ఎస్.అప్పారావు, అధ్యాపకుడు వి. కామేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో 110 క్రీడాకారులు పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజ్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పి. నాగబాబు, వై. విజయలక్ష్మి, ఎం. అనిలకుమారి పాల్గొన్నారు.


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

తూనికల్లో మోసగిస్తే కఠిన చర్యలు

- తూనికల విభాగం డీసీ రవికుమార్

హుకుంపేట: వారపు సంతల్లో దళారులు, వ్యాపారులు తూనికల్లో గిరిజనులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికల విభాగం డీసీ రవికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపుసంతలో గిరిజనుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే దళారి వ్యాపారుల తూనిక కాటాలను ఆయన తనిఖీ చేశారు.కాటాను రిమోట్ విధానంలో ఆపరేట్ చేయడాన్ని గుర్తించిన ఆయన వ్యాపారిపై ఆగ్రహానికి గురయ్యారు. ఎంతో కష్టపడి పండించిన గిరిజనులను మోసగించడం సరికాదని హెచ్చరించారు. మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


హుకుంపేట వారపు సంతలో తూనిక కాటాను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


డుంబ్రిగుడలోని ప్రమాదంలో మృతి చెందిన నాగభూషణ్


వాహనచోదకుడిని ఢీకొన్న కారు


బోల్తాపడిన ద్విచక్ర వాహనం

డుంబ్రిగుడ: మండలంలోని అరకు- పాడేరు జాతీయ రహదారి కించుమండ సమీపంలోని బిల్లాపుట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదబయిలు మండలం గంపరాయి గ్రామానికి చెందిన అడప నాగభూషణ్(34) అరకులోయలోని గురుకుల పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడి పిన్ని అనారోగ్యంతో మృతి చెందిన సమాచారాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ వద్ద సెలవు తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అరకు-పాడేరు ప్రధాన జాతీయ రహదారిలోని కించుమండల సమీపంలో గల బిల్లాపుట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని చింతపల్లి నుంచి అరకులోయ వైపు వస్తున్న టూరిస్టు కారు బలంగా ఢీ కొట్టింది. ఎగిరిపడిన మృతుడు డివైడర్‌ని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అనంతగిరిలోని రోడ్డు ప్రమాదంలో దివాకర్ మృతదేహం


దివాకర్ (ఫైల్)

అనంతగిరి(అరకులోయటౌన్): రోడ్డు ప్రమాదంలో శనివారం ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట కందాలవీధికి చెందిన పాట్నూరు దివాకర్(20) అనంతగిరి నుంచి స్కూటీపై ఎస్.కోట వెళ్తుండగా ఎస్.కోట నుంచి అరకులోయ మీదుగా కించుమండ వెళ్లే పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు డముకు సమీపంలో 5వ నెంబర్ హెయిర్‌పిన్ బెండ్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతుడు బస్సు వెనుక టైరు కింద పడడంతో అతడి తల మీద నుండి వాహనం వెళ్లడంతో గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయ్యింది. మృతుడు ఎస్.కోటలోని టింట్ హౌస్‌లో కూలీపని చేస్తుంటాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.